# సృష్టి సందర్శనం

చామకూర సత్యనారాయణ గారు

నేను నొకరోజున తలవని తలంపుగా కాటకూటేశ్వర మనే గ్రామం వెళ్లడం తటస్థించింది. అది నిడదవోలుకు నాలుగు మైళ్లదూరములోనే ఉంది. ఆగ్రామం అట్టే అంత పెద్దదని చెప్పేటందుకు వీలులేదు. ఊరంతా కలుపుతే రెండొందలు గడపుంటుందేమొ! గ్రామస్థులైనా అట్టే నాగరికత కలవాళ్లు కారు.

అసలు నే నాగ్రామం వెళ్లిన పనేమో చెప్పొద్దు! అచ్చటో దేవాలయం ఉందని, అది పూర్వం కాట్రాజు కూట్రాజుల కాలంలో కట్టబడిందనిన్నీ విని, అందేం విశేషం ఉందో చూద్దామని వెళ్లాను,

ఆ దేవాలయానికి వెళ్లే త్రోవలో ఒక చెరువుంది. ఆ చెరువందం ఏమని చెప్పను? మొగమంతా కళ్లుచేసుకొని అట్టే చూశాను ఒకగంటసేపు.

గంగమ్మతల్లి తామరాకులతోను, వికసించిన తామరపుష్పాలతోను, ముసుగు వేసుకొంది. ఆసమయం, సాయంత్రం కావడంచేత, ఆకాశాన్ని చిత్రవిచిత్రంగా వ్యాపిస్తోన్నాయి రకరకాల రంగులు. గంగమ్మతల్లికి రంగులంటే ప్రీతి కాబోలును. వెయ్యికళ్లూ పెట్టుకుని నిత్యం చూస్తూఉంటుంది. కనుపించిన రంగల్లా తనకే కావాలని ఫూసుకుంటుంది.

అప్పుడే సూరన్నగారుకూడా పగలంతా ఆకాశవీధిని ప్రయాణం చేసిచేసి అలసి పోయ్యాడు కాబోలు, మెలమెల్లగా, విశ్రమించడానికి దిగుతున్నాడు పడమటి కొండమీదికి.

నే నావినోదమంతా ఓ చెట్టుకి జారగిలబడి చూస్తునేఉన్నాను. కాని ఆవినోదంచూచి ఆనందించడానికి మాటుగా మతిపోయింది నాకు. అప్పుడు "నాకుంచ రంగులుంటే నా?" అనుకున్నాను అనుకుంటే నేమిలాభం?



సృష్టిరహస్యం తెలుసుకోవడం ఎవరి తరమనేతత్వంలోపడి, దేవాలయంవైపు ముఖం త్రిప్పాను.

అప్పుడే ఒకకాపాడు ఎదురయ్యాడు. కాపును అడిగాను:

నేను—ఐతే, ఓకాపూ! ఓకాపూ! ఈపొలం ఎవ్వరిది?

కాపు—ఏటిబాబు?

నేను—(వీడికి చెముడు కాబోలునురా దేముడా అనుకొని గొంతుకు బ్రద్దలయ్యేటట్టు) ఈపొలం ఎవ్వరిది?

కాపు—ఇనిపిచ్చింది బాబు! చెయిటి ముండకొడుకునండి. ఈపొలప్పేరడుగుతారా? కర్ణంగోర్దండి.

నేను—మఱి ఈగుడిపేరో?



కాపు—తెల్దండి, ఏంతెలుత్తుదిబాబూ! మాఅయ్యోరు సిన్నప్పుడు రెండచ్చరం ముక్కలొత్తయిగందాని, బల్లోపత్తే వల్లోసి బల్లోకెల్లందుకీ చిచ్చయ్యిందుండి. మీయంటి పెబువులేదైనా పెచ్చిత్తే, తూర్పేటో, పడమటేటో తెల్దండి.

(నేను వేసే ఈగొప్పప్రశ్నలకు చదువులు, శాస్త్రాలుకూడా ఎందుకో అనుకొని)

నేను—పోని ఈదేముడిపేరు తెలుసునా?

కాపు—దేవుడికి పేరేటి బాబు? మావోల్లంతా దేవుడేనంటారండి! బాబు! ఓచుట్ట ముక్క పారేత్తారా! మునలిముండాకొడుకునుండి.

నేను—తాతా! మాశావు? చుట్టలు కాల్చడమనేది మాయింటా వంటాకూడా లేదు. ఈఅణాతీసుకుని నీఇష్టంవచ్చింది కొనుక్కో. అని చెప్పి వాడి సమాధానాలకు నవ్వుకున్నాను కొంతసేపు వాడూ పొలం దాటాడు. నేను గుళ్లోకెళ్లాను. చూడండి తమాషా!

గుడిప్రక్క చెట్టుమీద "గలగల" చప్పుడయ్యింది. కన్నుమూసి కన్నుతెఱచేటంతలో ఎక్కడనుంచొచ్చాయో ఒకకోతుల దండు ప్రత్యక్షమయ్యింది.

అనేమనుకొన్నాయో నన్ను చూచి కాపల్లె దుడ్డుకర్ర, తట్ట తలపాగా లేవనుకొన్నాయి కాబోలు!

కిచకిచ లాడుతూ ముట్టేశాయి నా చుట్టూ. ఏంచెయ్యను? నోళ్లు తెఱచుకొని,

"గుర్ గుర్" శబ్దంచేస్తూ నావైపు తీవ్రంగా చూడ్డం మొదలుపెట్టాయి.

నాకైతే లోపల భయంగానేఉంది. "శివు నాజ్ఞలేందే చీమైనాకుట్ట"దని పెద్దలు చెప్పిన ముక్క జ్ఞాపకం తెచ్చుకొని పైకిమాత్రం ధైర్యంగానే భగవంతుడి మీద భారంవేసి, అవేం చేస్తాయో చూద్దామని కదలకుండా, మెదలకుండా నిలుచున్నాను.



వచ్చి నాకండువా ఒకటి, పంచికొంగొకటి పట్టుకొని లాగి నన్ను వెర్రిపుల్లాయిని చేశాయి. ఏమంటే ఏంచేస్తాయో అనిభయం చేత కొయ్యబారాను.

కాని జంతువులకున్న జ్ఞానం మానవ్వులకు లేదనిపించింది.

అనిపించిందన్నమాటేం! నిజంగా లేదుకూడాను. ఆవుకున్న స్వార్థత్యాగం - కుక్కకు గుర్రానికి ఉన్నవిశ్వాసం, - కాకులకున్న సంఘమైత్రి, కపోతములకున్న ఏకపత్నీవ్రతము, సృష్టికి అధికులమను మనుష్యులకుందా మరి?

అందులో దూరంగాఉన్న ఒకపండుకోతి "ఆయనెవరో పెద్దమనిషిలాగున్నాడు, ఆయన జోలి మీకెందుకర్రా". అని కాబోలు "కిచ కిచ" యని అరచింది.

ఆకోతిమూక మధ్యస్థంగా ఉన్న పెద్ద కోతిని—భగవానుడు, పురాణపురుషుడు ఐన శ్రీరామచంద్రుని ముఖ్యభక్తుడైన శ్రీ ఆంజ



నేయుడే ఆరూపంగా ప్రత్యక్షమయ్యాడా అనుకొని చూచేసరి కొకరెప్పపాటుకాలంలో ఒకకోతైనాలేదు నాదగ్గర. వెళ్లిపోయాయి. ఎక్కడివక్కడకువెళ్లి పెద్దకోతిచుట్టూ గుమిగూడాయి. అప్పుడు నేననుకున్నానుకదా:

“వీటిలో ఉన్న ఐకమత్యమే కనుక మనుష్యుల్లో ఉంటే ఈపాటికి స్వరాజ్యము రాకపోయుండా?”

సరి అది ఆలాఉండగా, ఇంకోవైపున మరోవినోదం కనుపించింది. అదేమిటంటా రేమొ! కోతులకుటుంబము. ఒకఆడకోతి, మగకోతి, భార్యాభర్తలు కాబోలు. ఒకదాని తల్లో ఒకటి పేలుచూసుకోవడం ఆరంభించాయి.



అల్లాఅవిపేలుచూసుకొంటూ ఉంటేవాటి పిల్లలుకాబోలు, వాటి ఆనందాన్ని అవి ఒకదానిపైఒకటి గెంతుచు అవన్నీ కలసి పేలుచూసుకుంటూ ఉన్న పెద్దకోతులమీద గెంతడం మొదలు పెట్టాయి. ఒక గెంతడమేనా? వాటికి విసుగుపుట్టేటంత అల్లరిచేశాయి.

కాని వాటికేమైనా కోపం వచ్చిందనుకున్నారేమో?

లేదు సుమండీ! లేదు! ఎంతమాత్రమూ లేదు!

వాటిగొడవలో అవున్నాయి.

అదెంతో ఆశ్చర్యంగా కనుపించింది నాకు. కనుపించి, ఎంతో జ్ఞానం కలవాళ్లం, ఓర్పుగలవాళ్లం, అనుకునే మనము కాసంత పిల్లలు గట్టిగా ఏడుస్తే గిట్టక వాళ్లు అల్లరి చేస్తే కర్రతీసుకు చావగొట్టడానికి వెళ్లే మనము — జంతువులనుంచి కూడా నేర్చుకోవలసినది చాలా ఉందని తెలుసుకున్నాను.